# ఉపాయం

పూర్వం ఓ రైతు కుటుంబం వుండేది. రైతు భార్య ఎంత అతివాగుడుమనిషంటే, ఆమెనోట్లో నువ్వుగింజయినా దాగదు. ఆవిడ ఓ కొత్త విషయం విన్నట్టుగానే, అది ఆ వూళ్ళో అందరికీ తెలిసిపోయిందన్నమాటే!

ఒకనాడా రైతు అడవిలోకెళ్ళాడు. తోడేలు బొరియలు తవ్వుతూండగా అతనికి గుప్తధనం కనిపించింది. అతను తనలో తానిట్లా అనుకున్నాడు: యిప్పుడు నేనేం చేసేట్టు? యీ ధనంవిషయం నా భార్యకు తెలిసినట్టయినా, ఊరంతా పాక్కిందన్నమాటే! భూస్వామికే గనక యీ సంగతి తెలిస్తే, అతనే యిదంతా కాజేస్తాడు. మరి మార్గమేమిటి?

...ఇట్లా ఆలోచింగగా ఆలోచింపగా అతనికో మెరుపులాంటి ఊహ తట్టింది. గుప్తధనాన్ని అట్లానే వుంచి, ఆ చోటు గుర్తుంచుకుని, యింటివైపు నడిచాడు. నదీ ప్రాంతానికి రాగానే వలవైపు చూసుకున్నాడు, దారాలనుపట్టుకు లాక్కొంటూ ఓ చేప కనిపించింది. దాన్ని బయటికి లాగి, ముళ్ళపొదపాటు వేసిన బోనుదగ్గరి కెళ్ళాడు. ఓ కుందేలు చిక్కుకుంది! కుందేలును బయటికి తీసి దానిస్థానంలో చేపనుంచాడు. వలలో కుందేలును పెట్టాడు! చీకటిపడ్డాక యింటికి చేరాడు.

'ఇదిగో, బాగా ఆకలవుతోంది గాని, నిప్పుచేసి రొట్టెలు కాల్చు' అన్నాడు.

"ఏం, ఎందుకేమిటి? యింత రాత్రప్పుడు నిప్పుచెయ్యడమేమిటి? యింత అర్ధరాత్రి నీకు రొట్టెలెవరు కాలుస్తూ కూర్చుంటారు?-యింకేం కావాలో నీకు."

"ఊరికే వాదనకి దిగక నేను చెప్పినట్లల్లా చెయ్యి. నాకు గుప్తధనం దొరికింది. దాన్ని యీ రాత్రే యింటికి తెచ్చుకోవాలి!"

~~~~*~~~~~~~~~~*~~~~

శ్రీ 'విరించి'

*~~~~~~~~~~~~~*~~~~

ఆమె ముఖం చేటంతయింది. అయిదు నిముషాల్లో నిప్పుచేసి రొట్టెలు కాల్చి భర్తకిచ్చింది.

రైతు ఒక రొట్టె తినటం, రెండు మూడు తన భార్య చూడకుండా సంచిలో వేసుకోటం-చేస్తున్నాడు.

'యివాళ నువ్వు రొట్టెలు ఊరికే తినేస్తున్నావు. అంత తొందరగా నేను కాల్చలేను.'

'మనం చాలదూరం వెళ్ళాలి. నేను కడుపునిండా తినాలి'

అతను సంచినిండా రొట్టెలు వేసుకుని-'ఆ! నా కడుపు నిండింది. నువ్వుకూడా తినెయ్యి. యింక బయల్దేరి పడదాం. తొందరగా తేవాలి!'

ఇద్దరూ కలిసి బయల్దేరారు. అప్పటికిచాలా చీకటిపడింది. రైతు ముందు నడుస్తున్నాడు. తన సంచిలోంచిరొట్టెలు తీసి ఒక్కొక్క చెట్టుకొమ్మకూ ఒక్కొక్కటి తగిలిస్తూ పోతున్నాడు.

అతని భార్య రొట్టెలు చూసి గట్టింది.

'చూడు, ఆ చెట్లకు రొట్టెలు!'

'అదేం వింత! యిప్పుడేకదా రొట్టెల వర్షం పడింది!'

'ఊహు, చూళ్ళేదు, నేను కిందికే చూస్తూ నడుస్తున్నాను-లేకపోతే పడిపోతానని!'

'ఇక్కడ నేను కుందేలుకోసం బోను పెట్టాను. ఏముందో చూద్దాం పద!'

ఇద్దరూ బోనుదగ్గరికి వెళ్ళారు. రైతు చేపని బయటికి తీశాడు.

'ఇదేమిటి, బోనులో చేప ఎట్లా పడింది?' అనడిగింది భార్య.

'నీకు తెలీదా? నీటిలోనే కాకుండా, భూమిమీద కూడా వుంటాయి చేపలు.'

'తమాషాయే! సాక్షాత్తూ చూశబట్టి గాని, లేకపోతే నేను నమ్మగలిగివుండేదాన్ని గాదు!'

వాళ్ళు నదిదగ్గరికొచ్చారు. 'యీ ప్రాంతాల నువ్వే వలవేసే
~~~~

# ★ ఉపాయం ★

'ఉంటావు-ఏదీ చూదాం' అంది భార్య.

వలలో కుందేలు చిక్కుకు నుంది.

'ఇవాళ యిదేమిటీ చిత్రాలు! చేపల వల్లో కుందేలా?' అంది భార్య

'యిందులో నీకు ఆశ్చర్య మేమిటో నాకర్థం కావటంలేదు. నీటికుందేళ్ళని ఎరగవా యేమిటి?'

'ఊహు'—ఈసరికి వాళ్లు గుప్త ధనంవున్న చోటుకు జేరుకొన్నారు. రైతు తవ్వాడు. వాళ్ళు మోయ గలంత బంగారాన్ని తీసుకుబయ ల్దేరారు.


రోడ్డు భూస్వామి ఇంటిమీదుగా వెడుతుంది. ఆ యింటికి దగ్గరసా వచ్చాక, వాళ్లకు 'బా, బా, బా, అంటూ మేక అరుపు వినవచ్చింది.

'ఓ! యేమిటది! నాకు భయ మేస్తోంది' అన్నది భార్య

'పద తొందరగా వెడదాం. భూతాలు గగ్గోలు చేస్తున్నయ్. యజమానిని పీక్కు-తింటున్నై,' ఒక్క-దాటున వాళ్ళు యిల్లు జేరు కున్నారు. రైతు బంగారాన్ని భద్రంగా దాచి పడుకున్నాడు.

'యీ విషయం, ఎవరికీ చెప్ప కేం—మూడోవాడికి తెలిసిందంటే చిక్కు-లో పడతాం.'

'ఊహు, ఎవరికీ చెప్పన్లే!' అంది అతని భార్య.'




మర్నాడు వాళ్ళిద్దరూ ఆల స్యంగా లేచారు.

రైతు భార్య లేచి పొయ్యి అంటించి, నీళ్ళకు బావిదగ్గరికి వెళ్ళింది.

పొరుగింటామె రైతు భార్యని పలకరించింది:

'యింత ఆలస్య మయిందేం-' అని.

'మెలుకువ రాలేదు. రాత్రంతా నిద్రలేదు.'

'ఏం?'

'మా ఆయన గుప్తధనాన్ని చూచారు. మేం వెళ్ళి రాత్రికి రాత్రే యింటికి తెచ్చుకున్నాం.'

—ఆరోజల్లా గ్రామంలో యిదే కబుర్లు ఫలానా రైతుదంపతులు గుప్తధనం కనుక్కున్నారు, రెండు బస్తాలనిండా యింటికి తెచ్చు కొన్నారు, అని. సాయంకాలమయే టప్పటికల్లా యీ కబురు భూస్వా మికి చేరింది. ఆయన రైతుకు కబురంపాడు.

'నీకు గుప్తధనం కనిపించినట్లు నాకెందుకు చెప్పలేదు?' అనడిగాడు.

'గుప్తధనం? నాకేం తెలీదే!'

'నిజం చెప్పు. నాకంతా తెలి సింది. నీ భార్యే స్వయంగా అంద రికీ చెప్పింది.'

'అదా! దానికి మతి సరిగ్గా లేదండీ. కలలోగూడ జరగని సంగ తులు చెబుతోంది!' 'ఆ సంగతి విచారించాలి!' అని భూస్వామి రైతుభార్యని పిలిపించాడు.

'నీ భర్త గుప్త ధనాన్ని కను క్కు-న్నాడుకదూ?'

'అవును.'

'రాత్రి మీ రిద్దరూ కలిసి వెళ్ళారు కదూ, దాన్ని యింటికి చేర్చేందుకు?'

'అవును బాబూ'

'ఆ సంగతంతా పూర్తిగా చెప్పు-'

'మేం ముందు అడవిలోకి వెళ్లాం. చెట్లనిండా రొట్టెలున్నాయి.'

'రొట్టెలా?'

'అవునండీ. అక్కడైన కుందేటి కోనుకోసం చూచాం, దాన్లో చేప పడ్డది. ఆ తరవాత చేపలవల లాగాం, దాన్లో కుందేలు పడ్డది. కుందేటిని చేపనీ యివతలకి తెచ్చు కున్నాం. గుప్తధనం వున్నచోట ఆమాయన తవ్వాడు. రెండు సంచులనిండా బంగారం యింటికి తెచ్చుకున్నాం. మీ ఇంటిమీదుగా వెళుతుండగా, లోపల పిశాచాలు పోట్లాడుకుంటున్నాయి. మిమ్మల్ని పీక్కు-తింటున్నై.'

—ఈ ఆఖరుమాటలో భూస్వా మికి అరికాలుమంట నెత్తికెక్కింది.

'ఛీ, అవతలికి పో, తెలివి తక్కు-వదానా!'

'చూచారండీ, దీని మతి ఎంత చలించిపోయిందో. దీనివల్ల నాకు జీవితం దుఃఖభాజన మవుతుంది' అన్నాడు రైతు అతి వినయంగా.

అవును, నాకు నమ్మకం చిక్కిం దిలే! సరే, నువ్వు వెళ్ళిపో అన్నాడు భూస్వామి.

రైతు తను భూస్వామి మీద ప్రయోగించిన తమాషాకి మన సులో నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

★

('రష్యన్ జానపదసాహిత్యం'-నుంచి)